క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

చండూరు : టీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కొండాపురం ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఫౌండేషన్ నిర్వాహకుడు బొబ్బల మనోహర్‌రెడ్డి, రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ డోలె నర్సాజీ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నరేందర్, శివ, సైదులు, శంకరయ్య, చంద్రయ్య, సత్తయ్య, లింగయ్య, శివ, కృష్ణయ్య, రవి, నరసింహ, శ్రీను, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద భక్తుల సందడి



పూజలో పాల్గొన్న భక్తులు

కనగల్ : దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవస్థానంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి అలంకరణ ఆకట్టుకుంది. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పసుపు, కుంకుమ వంటి అభిషేకాలు నిర్వహించారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సతీమణి రమాదేవి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వచనం తీసుకున్నారు.

దుస్తులు అందజేత



దుస్తులు అందజేస్తున్న అశోక్

నకిరేకల్ : పట్టణంలోని వీటీ కాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన పజ్జూరు కృష్ణకు ఆదివారం ప్రముఖ వస్త్ర వ్యాపారి, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ రావిరాల అశోక్ దుప్పట్లు, బెడ్ షీట్లు, దుస్తులు, చీరలు, నగదు అందజేశారు. కార్యమంలో స్థానిక సెయింట్స్ ఆన్ స్కూల్ టీచర్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి చికిత్సకు చేయూత



ప్రసన్నకు నగదు అందిస్తున్న శ్రీనివాస్

మునుగోడు: బ్రెయిన్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి ప్రసన్నకు నల్లగొండ ప్రకాశం బజార్‌లోని విజయ ఆప్టికల్ యజమాని శ్రీనివాస్ ఆదివారం ఏడు వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ప్రసన్న కన్నీటి గాథ ఈ నెల 17వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. స్పందించిన శ్రీనివాస్.. మునుగోడు మండలంలోని కల్వలపల్లిలో చిన్నారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని నగదు అందజేశారు.

కులాంతర వివాహం



కులాంతర వివాహం చేసుకుంటున్న శంకర్, దీప్తి

నల్లగొండ టౌన్: పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో ఆదివారం శాలిగౌరారం మండలం మాదారం గ్రామానికి చెందిన శంకర్, దీప్తికి కేవీపీఎస్ ఆధ్వర్యంలో కులాంతర వివాహం చేశారు. శంకర్, దీప్తిలతో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, ప్రజా సంఘాల నాయకులు మానుపాటి భిక్షమయ్య, పందుల సైదులు, రమణారెడ్డిలు దండలు మార్పించి వివాహం చేయించారు. కార్యక్రమంలో బొడ్డు శివకుమార్, బొల్లు రవీందర్, షరీఫ్, శీనయ్య, రమేష్, శివ పాల్గొన్నారు.

రేషన్ కార్డులు ఇచ్చేది ఎప్పుడో !

- ప్రజాపాలనలో 14 వేల దరఖాస్తులు
- అర్జీలను సివిల్ సప్లయ్ శాఖకు పంపిన మున్సిపల్ యంత్రాంగం
- ఇప్పటి వరకు పూర్తికాని సర్వే
- ఎదురుచూపుల్లో నీలగిరి వాసులు



ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది (ఫైల్)

నల్లగొండ టూటౌన్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రేషన్ కార్డుల కోసం నీలగిరి పట్టణ ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులకు మోక్షం లభించడం లేదు. నీలగిరి మున్సిపాలిటీలో మొత్తం 48 వార్డుల్లో మున్సిపల్ యంత్రాంగం నాలుగు నెలల క్రితం రెండో విడత ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించింది. దీంతో వివిధ వార్డుల నుంచి 14 వేల మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు పెట్టుకున్నారు. ఈ దరఖాస్తులన్నింటినీ మున్సిపల్ అధికారులు ఆన్‌లైన్ చేసి వివరాలను సివిల్ సప్లయ్ శాఖకు పంపించారు. మున్సిపల్ అధికారులు పంపిన వివరాలను ఇప్పటివరకు సివిల్ సప్లయ్ శాఖ అధికారులు పరిశీలించనే లేదు. దరఖాస్తుదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సర్వే చేయకుండా ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న నీలగిరి వాసులకు నిరీక్షణ తప్పడం లేదు.

కలెక్టర్ నిర్ణయం తీసుకుంటే తప్ప..

ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి నాలుగు నెలలు కావొస్తున్నా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హుల లెక్క తేల్చడం లేదు. ఇటీవల సివిల్ సప్లయ్ శాఖ అధికారులు నీలగిరి పట్టణంలో వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలని మున్సిపల్ అధికారులను సంప్రదించారు. ఎల్ఆర్ఎస్ 25 శాతం రాయితీ, ఆస్తి పన్ను చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ వంటి పనుల్లో ఉన్నందున తాము సర్వే చేయలేమని మున్సిపల్ అధికారులు చెప్పడంతో వారు వెనుదిరిగి వెళ్లారు. దాంతో క్షేత్ర స్థాయిలో సర్వే చేసి అర్హులను తేల్చేదెప్పుడో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అటు సివిల్ సప్లయ్ శాఖ, ఇటు మున్సిపల్ అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా దరఖాస్తుదారులకు ఇప్పట్లో రేషన్ కార్డులు అందే పరిస్థితి లేనట్టేననే చర్చ కొనసాగుతోంది. కలెక్టర్ నిర్ణయం తీసుకుంటే తప్ప అర్జీలపై సర్వే నిర్వహించి అర్హులను తేల్చేది కష్టమేనని తెలుస్తోంది.

వివరాలు ఇవ్వగానే సర్వే చేపడతాం

సివిల్ సప్లయ్ శాఖ వారు సర్వే చేయాలని సంప్రదించారు. పాస్‌వర్డ్, కీ వివరాలు ఇవ్వగానే వార్డు ఆఫీసర్ల ద్వారా సర్వే నిర్వహించి అర్హులను గుర్తించి వివరాలను పంపుతాం.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, నల్లగొండ

రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



కేక్ కట్ చేస్తున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : వరంగల్‌లో ఈ నెల 27న తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంత చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. నకిరేకల్‌లో ఆదివారం ఫంక్షన్ హాల్‌లో నకిరేకల్, కట్టంగూరు, కేతేపల్లి మండలాల బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి తన పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీలు మాద ధనలక్ష్మీ, తలారి బలరాం, స్వర్ణలత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, మారం వెంకట్‌రెడ్డి, పల్‌రెడ్డి మహిందర్‌రెడ్డి, గుర్రం గణేశ్, పల్లె విజయ్, రాచకొండ వెంకన్నగౌడ్, గోర్ల వీరయ్య, వంటల చేతన్, పెండెం సదానందం,, సామ శ్రీనివాస్‌రెడ్డి, శ్రవణ్, శేఖర్ రెడ్డి, ఆంజనేయులు, శంకర్ పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు మృతి

మర్రిగూడ : మండలంలోని తిరగండ్లపల్లి గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు కాగు ఎల్లయ్య ఆదివారం మృతిచెందారు. ఎల్లయ్య మృతదేహాన్ని సీపీఐ మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి, సహాయ కార్యదర్శి బూడిద సురేష్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఆకుల రఘుమయ్య, ఎరుకల నిరంజన్, కల్లెం యాదిరెడ్డి, వెంకట్రామ్, అంజయ్య, నరసింహ, హరీష్ తదితరులు ఉన్నారు.

శిరంశెట్టికి మాతృ వియోగం

చండూరు : తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్వై రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి శిరంశెట్టి శ్రీధర్‌బాబుకు తల్లి బాలమ్మ శనివారం రాత్రి మృతి చెందారు. ఆదివారం చండూరులో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. బాలమ్మ అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తోకల వెంకన్న, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ మాజీ సభ్యుడు పానుగోటి అంజన్‌రావు, మల్లారెడ్డి పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

మునుగోడు: ప్రధాని మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాలపై ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఆదివారం బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో మునుగోడులో అద్దంకి దయాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో యువ మోర్చా జిల్లా కార్యదర్శి పులకరం సైదులు, బీజేవైఎం సోషల్ మీడియా కన్వీనర్ జుట్టు అనిల్, యువ మోర్చా మండల కార్యదర్శి దోటి శ్రీను, శంభు, శ్రీరంగం, బొల్లపల్లి వెంకన్న, శంకర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కట్టంగూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001–02 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు చదువు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులకు శాలువా కప్పి మెమొంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు కొమ్ము శ్రీనివాస్, రంగారెడ్డి, లింగారెడ్డి, యాదగిరిరెడ్డి, శోభారాణి, రమాదేవి, పూర్వ విద్యార్థులు ముదుసు భిక్షపతి, చెరుకు రవి, మేడి శ్రీను, చింతపల్లి యాదగిరి, రామలింగయ్య, దేవిక, మమత, కవిత, శైలజ, బొడ్డుపల్లి వెంకన్న తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న కొరటికల్ గ్రామస్తులు

మునుగోడు: మండలంలోని కొరటికల్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఆ గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మూడు బోర్లు వేయించడంతో పాటు మోటార్లు అందించారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, మందుల బీరప్ప, గ్రామ అధ్యక్షుడు దండు లింగస్వామి, సీపీఐ నాయకుడు మందుల పాండు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

నల్లగొండ : మిషన్ ట్రిబుల్ ఆర్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని, డ్రైవింగ్ చేస్తున్న మైనర్లను పట్టుకుని కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేసినట్లు వన్ టౌన్ సీఐ వేమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. సరైన పత్రాలు లేని 35 వాహనాలకు చలాన్లు వేశామని, 18 వాహనాలను సీజ్ చేశామని, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేశామన్నారు. అదేవిధంగా సైలెన్సర్ మార్చి తిరుగుతూ జనాలకు అసౌకర్యం కలిగిస్తున్న ఒక రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాన్ని సీజ్ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ వేమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానాతో జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. వాహనాల తనిఖీలో ఎస్ఐ ఎన్ సందీప్ రెడ్డి, వన్‌టౌన్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడికి పూజలు



రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న సేవాదళ్ నాయకులు

చండూరు : తుమ్మలపల్లిలోని ప్రసిద్ధ రామలింగేశ్వర స్వామిని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు మేకల సాగర్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. వారితో వేద పండితులు అభిషేకం చేయించి తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీర్వాదాలు అందించారు. కార్యక్రమంలో మంఖల దాస్, రేణుకుమార్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, గిరి, రేణుక, శ్యామ్‌సుందర్, ఆసిఫ్, ఫరీద్, శంకర్, కత్తి పరమేష్ పాల్గొన్నారు.

నీటితొట్టికి మరమ్మతులు



సిలార్‌మియాగూడెంలో మరమ్మతులు చేసిన నీటితొట్టి

తిప్పర్తి : వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు గతంలో ప్రభుత్వం గ్రామాల్లో నీటితొట్లను ఏర్పాటు చేసింది. అవి చాలా గ్రామాల్లో పగిలి నీరు నిల్వ చేయడానికి వీల్లేకుండా మారాయి. ప్రస్తుతం వాటికి మరమ్మతులు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. మండలంలోని సిలార్‌మియాగూడెం శివారులో నీటి తొట్టి మరమ్మతులకు గురికావడంతో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి సలహా మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి అరవింద్‌రెడ్డి, మరమ్మతులు చేయించారు. వాటర్ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసి తొట్టిలో నిత్యం నీటిని నింపుతున్నారు.

రైతులకు సాగు నీరు అందించండి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి చివరి ఆయకట్టు రైతులకు సాగు నీరు అందించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టులపై ఆదివారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం తన స్వగృహంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు, ధర్మారెడ్డి, పిల్లాయపల్లి కాల్వల నిర్మాణం, అయిటిపాముల లిఫ్ట్ మ్యాప్‌లను పరిశీలించారు. ప్రాజెక్టుల తాజా పరిస్థితి, నిర్వహణపై చర్చించారు. కాల్వల నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు.

కరపత్రాల ఆవిష్కరణ

నకిరేకల్ పట్టణంలో వచ్చే నెల 5,6 తేదీల్లో నిర్వహించనున్న శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవ ప్రచార కరపత్రాలను ఆదివారం ఎమ్మెల్యే వేముల వీరేశం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్, వార్డు కౌన్సిలర్లు గాజుల సుకన్య, యాసారపు లక్ష్మీ, ఆలయ కమిటీ చైర్మన్ మోపురి చంద్రమౌళి, సంకోజు నారాయణ, సిద్దోజు భిక్షమాచారి, తర్నోజు కృష్ణమాచారి, శ్రీరామోజు మురళి, బసవోజు నాగచారి, జూలురి యజ్ఞాచారి, గడగోజు రవీంద్రాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



రామగిర(నల్లగొండ): సందేశం ఇస్తున్న కడప పాస్టర్ జోసెఫ్ ప్రసన్నకుమార్



కేక్ కట్ చేస్తున్న పాస్టర్ సోలమాన్



కేతేపల్లి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మతగురువులు

రామగిర(నల్లగొండ): ఈస్టర్ వేడుకలను గ్రేస్ ఇవాంజికల్ బాప్టిస్ట్ చర్చ్ పెద్ద బండలో రెవరెండ్ డాక్టర్ కె.మోజెస్ అధ్యక్షత ఆదివారం నిర్వహించారు. రేవరెండ్ శాంతి వర్ధన్ పునరుద్దాన సందేశం చేశారు. కార్యక్రమంలో ఎం.ఆనందమయ, విలియం కేరి, సుదర్శన్, శేఖర్, ఫిలిప్పు రెడ్డి, సురేష్, పవన్ కుమార్, డాక్టర్ బాబు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నల్లగొండ పట్టణంలోని మదీనా కాలనీలోని కవనెంట్ చర్చిలో ఈస్టర్ పండుగ సందర్భంగా పాస్టర్ సోలోమోను ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు జీవిత చరిత్రను వివరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో చర్చి పెద్దలు గ్రేస్, రూతు, మాధవి, సుగుణ, రాజశేఖర్, యెహోను, తేజ, అనిల్, మారయ్య, పరిమళ, పాల్గొన్నారు.

నకిరేకల్‌లో..

నకిరేకల్ : పట్టణంలోని ఫెయిత్ విల్లా క్రిస్టియన్ చర్చిలో ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ నేత దైద రవీందర్ పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో పాస్టర్లు పీటర్ సంతోష్, భాస్కర్, పాండు, నాగరాజు, రాజశేఖర్, సతీష్, సురేష్, మహేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లిలో..

కేతేపల్లి: ఏసుక్రీస్తు పునర్జన్మించిన రోజైన ఈస్టర్ వేడుకలను మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈస్టర్ సందర్భంగా మండలంలోని ఇనుపాముల, కేతేపల్లి, భీమారం, రాయపురం, చెర్కుపల్లి తదితర గ్రామాల్లో ఉన్న చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేతేపల్లిలోని జపమాలమాత చర్చి, రాయపురంలోని పునీత రాయప్ప, భీమారం చర్చిల్లో శనివారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి బాణాసంచా కాల్చారు. కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో ఆయా చర్చిల మత గురువులు ఫ్రాంచీస్, జోసెఫ్, చర్చి కమిటీ ప్రతినిధులు పసల ఆరోగ్యం, మాదాను విజయరాజు, మాదాను బాలస్వామి, పొలిశెట్టి జోజప్ప, పసల జోజప్ప, బందా జోసెఫ్, జయరాజు, అమర్‌కుమార్, కాటా విజయ్‌పాల్, గుప్పింటి రాయప్ప, పసల ధనరాజ్, గంగారపు శౌరి తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి భవనం పూర్తిచేసేది ఎప్పుడో ?



అసంపూర్తిగా వదిలేసిన తహసీల్దార్ కార్యాలయ అదనపు గదులు

మునుగోడు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి తగిన గదులు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ ఇబ్బందులు తొలగించేందుకు స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని మరో మూడు అదనపు గదుల నిర్మాణానికి ఎస్.డీ.ఎఫ్ నిధులు రూ. 15 లక్షలు ఏడాది క్రితం మంజూరు చేయించారు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ స్లాబ్ వేసి గోడల నిర్మాణం పూర్తిచేశారు. అయితే చేసిన పనికి బిల్లులు రాని కారణంగా నిర్మాణ పనులను నాలుగు నెలల క్రితం నిలిపివేశారు. ప్రస్తుతం ఉన్న మూడు గదుల్లో ఒకటి తహసీల్దార్‌తోపాటు ధరణి కంప్యూటర్లకు ఉయోగిస్తుండగా మరొకటి రికార్డులు భద్రపరిచేందుకు, ఇంకో గది డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్‌తోపాటు ఆర్.ఐలు ఉండేందుకు కేటాయించారు. ఇక జూనియర్ అసిస్టెంట్లు, సర్వేయర్‌తో పాటు ఇతర సిబ్బంది కనీసం కూర్చునేందుకు స్థలం కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే ఉన్న పాత ఎంపీడీఓ కార్యాలయంలో కూర్చొని ప్రజలకు సేవలు అందిస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని అసంపూర్తిగా ఉన్న అదనపు గదులను పూర్తి చేయించాలని సిబ్బంది, మండల ప్రజలు కోరుతున్నారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

కేతేపల్లి: మండల కేంద్రంలోని శ్రీ శంభులింగేశ్వర స్వామి ఆలయ నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం ఆదివారం ఆలయంలో నిర్వహించారు. మాజీ సర్పంచ్ ఏళ్ల అశోక్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొదటగా చైర్మన్ సంకోజు జేజయ్య ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ప్రధాన కార్యదర్శిగా ముదిరెడ్డి కర్ణాకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా జటంగి వెంకటనర్సయ్య యాదవ్, ఉపాధ్యక్షుడిగా వడ్డె వీరారెడ్డి సంయుక్త కార్యదర్శిగా అయితగోని వెంకన్నగౌడ్, కార్యవర్గ సభ్యులుగా అలుగుబెల్లి జోగిరెడ్డి, జటంగి రాంచంద్రయ్య, వీరబోయిన అబ్బయ్య, ఎర్రనాగుల యాదగిరి, మధు ప్రమాణ స్వీకారం చేశారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

నకిరేకల్ : పట్టణంలోని శ్రీ సత్యసాయి మందిర ఆవరణలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ హైదరాబాద్ శంకర్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 200 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 50 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం హైదరాబాద్‌లోని వారి ఆస్పత్రికి పంపించారు. ఈ శిబిరంలో సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు గర్రె శ్రీనివాస్, కంటి డాక్టర్లు అమిత్, విజయ్, సిబ్బంది సాయిక్రిషి, సంజన, రూపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మొక్కల పెంపకం !

- కనగల్ మండల లక్ష్యం 2,36,000
- జూన్ నాటికి సిద్ధం చేసేలా ప్రణాళిక
- నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా షేడ్ నెట్‌ల ఏర్పాటు



లచ్చుగూడెం నర్సరీ

కనగల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలోని నర్సరీలో మొక్కల పెంపకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రతి నర్సరీలో లక్ష్యం మేరకు మొక్కలు పెంచేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. కనగల్ మండల పరిధిలోని 31 గ్రామపంచాయతీల్లో ప్రతి నర్సరీలో 10 వేల మొక్కలు పెంచే విధంగా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. చిన్న గ్రామపంచాయతీల్లో మాత్రం 5 వేల మొక్కలు పెంచుతున్నారు. మొత్తం 2,36,000 మొక్కల పెంపకమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించారు. జూన్ నెల నాటికి మొక్కలు సిద్ధంగా ఉంచాలని భావిస్తున్నారు.

వేసవిలో మొక్కలపై ప్రత్యేక దృష్టి..

వేసవిని దృష్టిలో పెట్టుకుని మొక్కల పెంపకంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ప్రతి నర్సరీకి గ్రీన్‌షేడ్ నెట్లను ఏర్పాటు చేశారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటుతున్నారు. ప్రతిరోజు మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందిస్తూ సంరక్షిస్తున్నారు. కలుపు మొక్కలను తొలగిస్తు మొక్కలను ఏపుగా పెరిగేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

వివిధ రకాల మొక్కలు..

ప్రతి నర్సరీలో ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో పండ్లు, పూలు, కలపనిచ్చే వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. జామ, నిమ్మ, టేకు, వేప, మునగ, కానుగ, అల్లనేరేడు, దానిమ్మ, బొప్పాయి, కృష్ణతులసీ, సీతాఫలం, తురక వేప, చింత, గన్నేరు, గోరింటాకు, మందార, చామంతి, ఉసిరి, చిన్నబాదం తదితర మొక్కలతోపాటుగా పలు రకాల పండ్ల మొక్కలను పెంచుతున్నారు.

జాగ్రత్తలు తీసుకుంటున్నాం



నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. మొక్కకు రక్షణగా గ్రీన్‌షేడ్‌నెట్లను కొత్తగా ఏర్పాటు చేయించాం. ఎండ కాలంలో మొక్కలు ఎండిపోకుండా రోజుకు రెండు మార్లు నీరు పట్టిస్తున్నాం. వన మహోత్సవంలో కనగల్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

–జయరాం ఎంపీడీఓ

సూచనలు ఇస్తున్నాం

ప్రభుత్వ లక్ష్యం మేరకు నర్సరీల్లో మొక్కలను పెంచేందుకు కృషి చేస్తున్నాం. వచ్చే జూన్ నాటికి మొక్కలు ఏపుగా పెరిగేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో నర్సరీలను సందర్శించి మొక్కల ఎదుగుదలను పరిశీలిస్తున్నాం. ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శుల తోపాటు నర్సరీల నిర్వాహకులకు సూచనలు అందిస్తున్నాం.

–సుమలత, ఎంపీఓ

10 వేల మొక్కలు పెంచుతున్నాం



జి యడవల్లి నర్సరీలో 10 వేల మొక్కలను పెంచుతున్నాం. ఈ ఎండకాలంలో మొక్కల సంరక్షణకు కొత్తగా గ్రీన్‌షేడ్‌నెట్‌లను ఏర్పాటు చేశాం. ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్కలకు నీరు అందిస్తు ఏపుగా ఎదిగేందుకు కృషిచేస్తున్నాం. ప్రస్తుతం రెండు నెలల్లోనే మొక్కలు ఎంతో ఎదిగాయి.

–ఖాసీం, జి యడవల్లి పంచాయతీ కార్యదర్శి